

లండన్‌లో చేనేత బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఎన్నారైలు

# లండన్‌లో చేనేత బతుకమ్మ సంబురాలు

- టాక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ
- చేనేత వస్త్రాలు ధరించి వేడుకలకు హాజరైన ఎన్నారైలు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : లండన్‌లో చేనేత బతుకమ్మ, దసరా సంబురాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబురాలకు యూకే నలుమూలల నుంచి 3వేలకుపైగా ఎన్నారై కుటుంబసభ్యులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా స్థానిక ఎంపీ సీమ మల్హోత్రా, మేయర్ అఫ్జాల్ కియాని, కౌన్సిలర్ ఆదేశ్ ఫార్మహాన్ పాల్గొన్నారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు, టాక్ జాతీయ కన్వీనర్ అశోక్ గౌడ్ దూసరి మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ కృషితో తెలంగాణ ప్రభుత్వం చేనేతకు చేయూతనిస్తూ అనేక కార్యక్రమాలు చేస్తుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నారైలంతా చేనేత వస్త్రాలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలందరూ గౌరీదేవికి పూజలు చేసి, బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. తమను నిత్యం వెన్నంటి ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు టాక్ నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టాక్ ఉపాధ్యక్షులు శుష్మణ రెడ్డి, సత్య చిలుముల టాక్ ప్రధాన కార్యదర్శులు సురేశ్ బుడగం, జాహ్నవి దూసరి, అడ్వైజరీ బోర్డు చైర్మన్ మట్టా రెడ్డి, సభ్యులు స్వాతి బుడగం, సుప్రజ పులుసు, వెంకట్ రెడ్డి దొంతుల, మల్లా రెడ్డి, సత్యపాల్ పింగిళి, గణేశ్ కుప్పలా, గణేష్ పాస్తం, రాకేశ్ పటేల్, రవి రేటినేని, రవి ప్రదీప్ పులుసు, మాధవ రెడ్డి, సతీశ్ రెడ్డి గొట్టిముక్కల, శ్రావ్య వందనపు, హరిగౌడ్ నవాబ్‌పేట్, క్రాంతి రేటినేని, శ్వేతా మహేందర్, శశి దొడ్లే, శ్రీలక్ష్మి, ప్రశాంత్ మామిడాల, శ్రీకాంత్ ముదిరాజ్, తేజ, నిఖిల్, మౌనిక, ప్రవీణ్ వీర, శ్రీకాంత్ జెల్ల, శైలజ, శ్రీధర్ రావు, కార్తీక్, ప్రశాంత్ మామిడాల, మహేందర్, శ్రీవిద్య, స్నేహ, విజిత, సత్యం కంది, రంజిత్, వంశీ, నరేశ్ నాగరాజు, మ్యాడి, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

# శివరామ్ అరెస్టుకు పోలీసుల కసరత్తు

**రిమాండ్‌కు అనుమతిపై నేడు పిటిషన్ • జిల్లా కోర్టులో విజ్ఞప్తికి అధికారులు సిద్ధం**

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ప్రవళిక ఆత్మహత్య కేసులో నిందితుడు శివరామ్‌రాథోడ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించేందుకు అనుమతివ్వాలని శుక్రవారం పిటిషన్‌ను దాఖలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నిందితుడి రిమాండ్‌కు సంబంధించిన సాక్ష్యాధారాలను జిల్లా కోర్టులో సమర్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దయభాస్కర్‌రావు.. శివరామ్‌కు బెయిల్ మంజూరు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రవళికతో నిందితుడికి ఉన్న పరిచయాలకు సంబంధించి ఫోరెన్సిక్ నుంచి సేకరించిన ఆధారాలను జిల్లా కోర్టుకు సమర్పించనున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించే అవకాశం లేదని, పోలీసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యం లో కోర్టు చొరవ తీసుకోకూడదని మెజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను గురువారం పీపీ ద్వారా అధికారులు తీసుకున్నారు. మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట సాక్ష్యాధారాలను సమర్పించకపోవడం వల్ల బెయిల్ మంజూరు కావడం తో నిందితుడి రిమాండ్ కేసు డైరీలో నమోదు చేసిన సాక్ష్యాధారాలను జతచేసి పిటిషన్‌ను జిల్లా కోర్టులో దాఖలు చేయనున్నారు.

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి సునీత రాజీనామా

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి వాకిటి సునీతా లక్ష్మారెడ్డి రాజీనామా చేశారు. దీంతో ఆమె రాజీనామాను ఆమోదిస్తూ గురువారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న నేపథ్యంలో తాను పదవికి రాజీనామా చేసినట్టు సునీత తెలిపారు.



గురువారం బీఆర్ఎస్‌లో చేరిన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామస్థులతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి

# బీఆర్ఎస్‌కు జైకొట్టిన ముదిరాజ్‌లు

- ఈటల రాజేందర్‌కు షాక్ ఇచ్చిన చిన్నకోమటిపల్లి వాసులు

హుజూరాబాద్, అక్టోబర్ 26 : కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామస్థులు బీఆర్ఎస్‌కు జైకొట్టారు. 500 మంది గురువారం గులాబీ గూటికి చేరారు. హుజూరాబాద్‌లోని సాయి కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లోకి వచ్చిన వారిలో బీజేపీ నుంచి ఎక్కువ మంది ఉండగా, ఇందులో పెద్ద ఎత్తున ముదిరాజ్ కులస్థులు ఉండటం గమనార్హం. ఈటల రాజేందర్ సామాజిక వర్గం వారే బీఆర్ఎస్‌లో చేరి ఆయనకు షాక్ ఇచ్చారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ ఆగమైపోతామని, వాళ్ల చేతిలో రాష్ట్రాన్ని పెడితే కుక్కలు చింపిన విస్తరి చేస్తారని హెచ్చరించారు. ప్రజలందరికి ప్రగతి ఫలాలు అందాలంటే మూడోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం 'రథ్ ప్రభారీస్'కు ఈసీ బ్రేక్

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేరిట బ్యూరోక్రాట్లతో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయించాలన్న మోదీ సర్కారు ప్రయత్నాలకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) బ్రేకులు వేసింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ఈ యాత్ర నిర్వహించరాదని క్యాబినెట్ సెక్రటరీకి ఈసీ స్పష్టంచేసింది. కేంద్ర పథకాల ప్రచారానికి రథ్ ప్రభారీస్‌గా (స్పెషల్ ఆఫీసర్లు) బ్యూరోక్రాట్లను నియమిస్తూ కేంద్రం ఇటీవల జారీచేసిన ఉత్తర్వులు వివాదస్పదమైన విషయం తెలిసిందే. బ్యూరోక్రాట్లనూ రాజకీయ లబ్ధికి కేంద్ర ప్రభుత్వం వాడుకుంటుండటంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

## పబ్లిసిటీ కోసం కరెన్సీ నోట్ల వర్షం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: చెక్ రిపబ్లిక్‌కు చెందిన టీవీ వ్యాఖ్యాత, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ కామిల్ బర్తోషెక్ 'వన్‌మ్యాన్ షో ది మూవీ' అనే సినిమాలో నటించాడు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా యూజర్ల కోసం ఓ పోటీని నిర్వహించాడు. సినిమాలో ఉన్న పజిల్‌ను పరిష్కరించిన మొదటి వ్యక్తికి లక్ష డాలర్ల బహుమతి ఇస్తానని ప్రకటించాడు. ఏ ఒక్కరూ పజిల్‌ను పరిష్కరించకపోయేసరికి, వారందర్నీ ఓ ప్రాంతానికి పిలిచి.. నగదు మొత్తాన్ని హెలిక్యాప్టర్ ద్వారా జారవిడిచాడు.

## మత ప్రబోధకుడు బాబా మహరాజ్ కన్నుమూత

థాణే, అక్టోబర్ 26: కీర్తాంకర్‌గా పేరొందిన ప్రముఖ మత బోధకుడు బాబా మహరాజ్ సతార్కర్ కన్నుమూశారు. చాలా కాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన నవీ ముంబై టౌన్‌షిప్‌లోని నేరల్‌లో గురువారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. 89 ఏండ్ల సతార్కర్ మహారాష్ట్రతో పాటు విదేశాల్లో పలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సతార్కర్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర సీఎం షిండే సంతాపం తెలిపారు.

## సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రకు పితృ వియోగం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తండ్రి, మాజీ పోలీసు అధికారి ముత్యాల బెంజిమన్ రంజిత్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. 1968లో ఎస్సైగా పోలీసు శాఖలో చేరిన రంజిత్ ప్రజలకు అనేక సేవలందించారు. ఎస్సై నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ 2000 సంవత్సరంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీగా పదవీ విరమణ పొందారు. రంజిత్ మరణవార్త తెలుసుకొన్న డీజీపీ అంజనీకుమార్, ఇతర ఉన్నతాధికారులు మహేశ్ భాగవత్, నగర సీపీ సందీప్ శాండిల్య తదితరులు దవాఖానకు చేరుకొని భౌతికకాయానికి నివాళులర్పించారు. స్టీఫెన్ రవీంద్రకు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బాన్సువాడ దవాఖానకు జాతీయ అవార్డులు

**సిబ్బందికి అభినందనలు తెలిపిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 26: బాన్సువాడ మాతా శిశు దవాఖానకు మరో మూడు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు వరించాయి. జాతీయ వైద్యారోగ్య నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, అన్ని విభాగాల్లోనూ రోగులకు మెరుగైన సేవలందిస్తున్నందుకు గాను ముస్కాన్, లక్ష్య, ఎన్‌క్యూఏఎస్ అవార్డులు లభించాయి. ఇటీవల జాతీయ వైద్య బృందం పలుమార్లు బాన్సువాడ దవాఖానను సందర్శించి ఇక్కడ అందుతున్న సేవలు, పరిసరాల పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ కంట్రోల్, బయో మెడికల్ వేస్టేజ్ తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఒక్కో విభాగానికి పాయింట్లను కేటాయించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. అన్ని విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తుండటంతో బాన్సువాడ మాతాశిశు దవాఖానకు 2023 సంవత్సరానికి ఒకేసారి మూడు జాతీయ అవార్డులు వరించాయి. ముస్కాన్, లక్ష్య అవార్డుల కింద ఏడాదికి రూ.6 లక్షలు, ఎన్‌క్యూఏఎస్ అవార్డు కింద సంవత్సరానికి రూ.10 లక్షల రూపాయల చొప్పున మూడేండ్లపాటు దవాఖానకు అందిస్తారని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. డాక్టర్లు, అన్ని విభాగాల సిబ్బంది కృషి వల్లే జాతీయ అవార్డులు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. మూడు అవార్డులు రావడంతో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.



# బుల్లెట్ల బ్యాగ్‌ను పట్టించిన సీసీ కెమెరాలు

- సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఫిర్యాదుతో పోలీసుల విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇటీవల చోరీకి గురైన 60 రైఫిల్ బుల్లెట్లు, మూడు మ్యాగజిన్లను నగరంలోని పలు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇండియన్ స్మాల్ ఆర్మ్స్ సిస్టమ్ (ఐఎన్ఎస్ఏఎస్) 60 రైఫిల్‌కు చెందిన కొన్ని రౌండ్లు, మూడు మ్యాగజిన్లు ఉన్న బ్యాక్‌ప్యాక్ చోరీకి గురైందంటూ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సిద్ధార్థ్‌సింగ్ చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 24న ఫిర్యాదు చేశారు. డీజీపీ అంజనీకుమార్, రైల్వేస్, రోడ్ సేఫ్టీ ఏడీజీ బీ శివధర్‌రెడ్డి సూచన మేరకు రైల్వేస్ ఎస్పీ షేక్ సలీమా 8 బృందాలతో విచారణకు ఆదేశించారు. రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి, బ్యాక్‌ప్యాక్‌ను దొంగిలించిన నిందితుడు ఆనందమూర్తిని గుర్తించి, గాంధీనగర్ మెట్రోస్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతను బుల్లెట్లను మెట్రోపిల్లర్ వద్ద వదిలేసి, బ్యాగ్‌ను మాత్రమే తీసుకెళ్లానని చెప్పడంతో మరో వంద సీసీ కెమెరాలను పరిశీలించారు. వాకింగ్‌కు వచ్చిన రాచమల్ల సత్యనారాయణ అనే వ్యక్తి వాటిని తీసుకెళ్లినట్టు గుర్తించారు. అతన్ని విచారించడంతో తానే పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తీసుకెళ్తున్నట్టు తెలపడంతో బుల్లెట్లను, మూడు మ్యాగజిన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం తన కార్యాలయంలో ఈ కేసును చాకచక్యంగా పరిష్కరించిన సిజీఆర్పీ, ఆర్పీఎఫ్, పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించి, జ్ఞాపికలు అందజేశారు.



సీజీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందిని అభినందిస్తున్న డీజీపీ అంజనీకుమార్

